క్లుప్తంగా

సదస్సుకు ఉద్యోగులు తరలిరండి



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న మల్లికార్జునుడు

కపిలేశ్వరపురం (మండపేట): అమలాపురంలో ఈనెల 9న ఏపీఎన్జీఓ సంఘం నిర్వహించ తలపెట్టిన సదస్సుకు ఉద్యోగులు తరలిరావాలని కపిలేశ్వరపురం మండల ఉద్యోగులు నిర్ణయించారు. జిల్లా అడహాక్ కమిటీని ఏర్పాటు చేసే లక్ష్యంలో రాష్ట్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణ అమలాపురం రానున్నారని సంఘం మండపేట యూనిట్ అధ్యక్షుడు జె మల్లికార్జునుడు తెలిపారు. కపిలేశ్వరపురం, మండపేట ఎంపీడీఓ కార్యాలయాలు వద్ద సన్నాహక సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో కపిలేశ్వరపురం ఎంఈఓ కె.తాతారావు, వ్యవసాయ శాఖాధికారి బలుసు రవి, ఎంపీడీవో కార్యాలయ ఏవో జి.రాజేంద్ర ప్రసాద్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రామకృష్ణ, అచ్చుతాపురం ఎంపీహెచ్ఈఓ గోపాలకృష్ణ, నాని బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ మెట్లపై బురద తొలగింపు



పుష్కర ఘాట్ మెట్లను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలోని గౌతమి గోదావరి నదికి ఇటీవల పలు మార్లు వరద ఉధృతి పెరిగింది. ఈ వరద ఉధృతి వల్ల ఫెర్రీలోని మూడు పుష్కర ఘాట్ల మెట్లు బురదగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దేవీ నిమజ్జనాల్లో కూడా పుష్కర ఘాట్లు బురదతో నిండి ఉండడం వల్ల నిమజ్జనాలకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీంతో సర్పంచ్ పెమ్మాడి బేబి, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ సోమవారం పుష్కర ఘాట్ మెట్లను శుభ్రం చేయించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులతో పుష్కరఘాట్ మెట్లపై పేరుకుపోయిన బురదను తొలగించి మోటర్ సహాయంతో మెట్లను శుభ్రం చేశారు. పుష్కర ఘాట్ మెట్లను శుభ్రం చేయడంతో గోదావరి స్నానానికి వచ్చే భక్తులు, పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు.

సీఈసీ సభ్యురాలిని కలిసిన చైర్‌పర్సన్




చింతా అనురాధను కలిసిన చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆమె స్వగ్రామం మొగళ్లమూరులో మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఉన్నారు.

సూపర్ జీఎస్టీపై వ్యాసరచన పోటీలు

కె.గంగవరం: మండలంలో ఉన్న పది ఉన్నత పాఠశాలల్లో సోమవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పామర్రులో నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలను ఎంఈఓ నాగరాజు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన ఉండేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని రకాల వస్తువులు, యంత్రాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల ప్రజలు మేలు జరుగుతుందని తెలిపారు. వ్యాసరచన పోటీల అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు కూడా అందిస్తామన్నారు.

రికార్డ్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి



మేడిశెట్టి (ఫైల్) వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణ మున్సిపల్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న మేడిశెట్టి వెంకటేశ్వరరావు (58) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో సైదిల్‌పేటలోని తన ఇంట్లో మృతి చెందారు. 1998 జనవరి 3న ఆయన మున్సిపాలిటీలో విధుల్లో చేరారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కమిషనర్ టీవీ రంగారావు, డీఈ శ్రీనివాస్, మేనేజర్ భీమరాజు రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎం సుజాత, ఏఈలు, ఆర్ఓజేజీఎస్ శాస్త్రి, ఆర్ఐ అందే శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

మాటల్లో గొప్పలు.. ప్రజలకు తిప్పలు..!

- అసంపూర్తిగా ఎంపీడీవో కార్యాలయ భవనం
- శిథిలమైన వాటిలోనే విధుల నిర్వహణ
- మండపేటలో పూర్తికాని ఆసుపత్రి నిర్మాణం



కపిలేశ్వరపురంలో అసంపూర్తిగా ఎంపీడీవో కార్యాలయ భవనం



ఎంపీడీవో కార్యాలయ నిర్మాణ పనులకు వేసిన శిలాఫలకం

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే ప్రజల పక్షాన నిలవాలి. ప్రజల బాగోగులు చూసుకునేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన భవనాలు సమకూర్చాలి. కార్యాలయాల్లో తగిన సిబ్బందిని, సాంకేతిక పరికరాలనూ సమకూర్చాలి. కార్యాలయాన్ని సందర్శించే ప్రజలకు తగిన సమాచారాన్ని అందించాలి. కానీ, కూటమి ప్రభుత్వానికి ఇవేమీ పట్టనట్టు ఉంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను రూపొందించింది. ప్రతి గ్రామంలో ప్రాథమికంగా సచివాలయం, ఆర్‌బీకే, ఆరోగ్య కేంద్రాలను నిర్మించేందుకు పక్కా కార్యచరణను చేపట్టింది. పాఠశాల భవనాలను నాడు– నేడు పథకం ద్వారా నిర్మాణాన్ని చేపట్టింది. మొత్తంగా ప్రభుత్వ భవనాల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేసింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలన కొత్త భవనాల సంగతి ఎలా ఉన్నా.. అసంపూర్తిగా నిలిచిన భవనాలనైనా పూర్తి చేయలేని స్థితిలో కొనసాగుతోంది. అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. ఏడాదిన్నర పూర్తవుతున్నా కనీసం చర్యలు కూడా లేవు. గత ప్రభుత్వ హయాంలో నాడు– నేడు పథకం ద్వారా మంజూరైన ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణ పనులనైనా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

మొండి గోడలతో దర్శనం

కపిలేశ్వరపురంలో మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణం 2009 నుంచి అసంపూర్తిగా ఉంది. మొండి గోడలతో దర్శనమిస్తుంది. భవన నిర్మాణానికి ప్రాథమికంగా 2009 ఫిబ్రవరిలో రూ.55 లక్షలు మంజూరు కావడంతో అప్పటి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆ నిధుల లభ్యతను బట్టి స్లాబు ఎత్తు వరకూ నిర్మాణం జరిగింది. తర్వాత కాలంలో మండల పరిషత్ తరఫున ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడంతో అప్పట్లో జిల్లా పరిషత్ అధికారులు పలు మార్లు చూసి వెళ్లారే తప్ప నిధులను మంజూరు చేయలేదు. 2009లో జిల్లా పరిషత్‌కు కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, తాతపూడి, కపిలేశ్వరపురం గ్రామాల్లో ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక సీనరేజి నిధులు సమకూరేవి. వాటి ద్వారా కోట్లాది రూపాయిల సీనరేజి నిధులు అటు జిల్లా పరిషత్‌కు, ఇటు మండల పరిషత్, ర్యాంపులు ఉన్న గ్రామాలకు సమకూరడంతో మండల పరిషత్ కార్యాలయ నూతన భవనానికి జిల్లా పరిషత్ నుంచి నిధులు కేటాయించాలంటూ అప్పటి ప్రజాప్రతినిధులు అనేక మార్లు విజ్ఞప్తులు పంపారు.

ప్రత్యేక గదులు అవసరం

మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి ఉమ్మడి రాష్ట్రంలోని సుదూర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నప్పటికీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో అప్పట్లో నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్న ఊసెత్తడంలేదు. ప్రస్తుతం కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యకలాపాలన్నీ శిథిల భవనంలోనే నిర్వహిస్తున్నారు. పలు శాఖల విభాగాలకు ప్రత్యేక గదులు అవసరం ఉండటంతో పాటు కార్యాలయ రికార్డులు, సామాగ్రిలను భద్రపర్చుకునేందుకు గదులు అవసరం ఉంది. పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖలకు ఒక్కో గదిని మాత్రమే కేటాయించారు. ఆయా శాఖల సామాగ్రి, రికార్డులను భద్రపర్చుకోవడం సమస్యగానే ఉంది. శాఖల సిబ్బంది అవసరాలను తీరేందుకు విశాల భవనం అవసరం ఉంది. తగిన నిధులను సమకూర్చి భవన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇతర భవనాల పరిస్థితీ అంతే...

రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఇరుకు భవనంలో కొనసాగుతోంది. కనీస వసతులు కరువయ్యాయి. కాజులూరు మండలంలోని 26 గ్రామాలకు పోలీస్ స్టేషన్ ద్వారా పౌర సేవలందుతున్నాయి. దీర్ఘకాలంగా అద్దె భవనంలో కొనసాగగా.. ప్రస్తుతం పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లోకి మార్చారు. తగిన నిధులను మంజూరు చేసి పక్కా భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. మండపేటలో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పనులు నిధులు కొరత కారణంగా నత్తనడకన సాగుతున్నాయి. ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంతో గత ప్రభుత్వం ఈ భవన నిర్మాణ పనులను ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం కనీసమాత్రంగానైనా ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేసే కార్యచరణ చేపట్టని పరిస్థితి. మున్సిపల్ నిధులకు తోడు ప్రభుత్వం తగిన నిధులను మంజూరు చేసి ఆసుపత్రిని పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యతోనే సమాజాభివృద్ధి



ఇంజినీరింగ్ విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ఎంపీ బోస్, మాజీ ఎంపీ అనురాధ

ఇంజినీరింగ్ విద్యార్థికి రూ.లక్ష సాయం

రాయవరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. మండలంలోని కూర్మాపురంలో వైఎస్సార్ సీపీ నేత కందర్ప హనుమాన్, ఆయన సోదరి కందర్ప భానుమతి చేతుల మీదుగా ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ బోస్ మాట్లాడారు. ఉన్నత విద్య చదివే పేద విద్యార్థులకు కందర్ప హనుమాన్, ఆయన సోదరి భానుమతిలు బాసటగా నిలవడం విద్యపై వారికి ఉన్న అభిమానాన్ని చాటుతుందన్నారు. ఇటువంటి దాతలను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాధరెడ్డి, తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి తదితరులు మాట్లాడుతూ, హనుమాన్, భానుమతి సేవలను ప్రశంసించారు. అనంతరం కందర్ప రామచంద్రం, కామేశ్వరి దంపతుల జ్ఞాపకార్థం ఉన్నత చదువులు చదివే విద్యార్థి అల్లం హేమ శివ శంకర్‌కు రూ.లక్ష చెక్కును అందజేశారు. హనుమాన్, భానుమతి మాట్లాడుతూ, మూడు ఏళ్లుగా హేమ శివశంకర్‌కు ఏటా రూ.లక్ష చొప్పున ఉన్నత చదువుల నిమిత్తం ఆర్థిక సాయం చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజబాబు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, పార్టీ నేత జిన్నూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలనూ మోసం చేసిన కూటమి



మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌కు అముజూరు గ్రామ కమిటీ సభ్యుల వివరాలను అందిస్తున్న నాయకులు

కె.గంగవరం: ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తరువాత పూర్తి స్థాయిలో హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలనూ కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, యండగండి, పామర్రు తదితర గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి పార్టీల గ్రామ కమిటీలకు సంబంధించిన నాయకులను కలసి పేర్లు నమోదు చేసుకున్నారు. అముజూరులో ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం ద్వారా పూర్తి స్థాయిలో పిల్లలందరికీ సాయం అందించలేదన్నారు. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందిస్తామని మేనిఫెస్టోలో చెప్పారని కానీ ఇప్పుడు చెప్పకుండా సాయం అందిస్తున్నామని ప్రకటించడం దారుణమన్నారు. అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని ప్రస్తుతం పార్టీ గ్రామ కమిటీలతో పాటు అనుబంధ కమిటీలను కూడా ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. పార్టీ నాయకులు పంపన సుబ్బారావు, చిట్టూరి చిన్ని, కూళ్ల సర్పంచ్ నాగేశ్వరరావు, యువజన విభాగ ఉపాధ్యక్షుడు పెట్టా రాజేష్, గ్రామ నాయకులు నానాపరపు శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీను, పెంకే రవిచంద్ర పాల్గొన్నారు.

పీజీ కోర్సులో డాక్టర్ శ్రావణి ఉత్తీర్ణత



డాక్టర్ శ్రావణిని అభినందిస్తున్న సూపరింటెండెంట్ ప్రవీణ్ తదితరులు

రామచంద్రపురం: పట్టణంలోని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో గుంటూరుకు చెందిన డాక్టర్ శిక్షణ పొంది ప్రతిష్టాత్మక డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ ఇన్ పీడియాట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తి చేయడంతో పాటు ఆ కోర్సులో ఉత్తీర్ణురాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లు కె.హేమంత్ చక్రధర్, బి.వీరభద్రుడు, ప్రస్తుత సూపరింటెండెంట్ ప్రవీణ్‌ల కృషితో 2023లో డీఎన్‌బీ కోర్సు నిర్వహణకు అనుమతి లభించింది. అప్పటిలో రెండు సీట్లకు ముందస్తుగా అనుమతి ఇచ్చినా ఒక సీట్ మాత్రమే మంజూరైంది. డాక్టర్ శ్రావణి అప్పుడు ఈ కోర్సులో చేరారు. రెండు సంవత్సరాలు విజయవంతంగా కోర్సు పూర్తి చేయడంతో పాటు ఉత్తీర్ణత పరీక్షలో విజయం సాధించడంతో సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆమెను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి నుంచి మొదటి విద్యార్థినిగా ఆమె పేరు నిలిచిపోతుందని అభినందించారు. కార్యక్రమంలో ఏఓ పి.ఈశ్వరరావు, వైద్యులు నరేంద్ర, సునీత, సౌమ్య, సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం డిపోకు జిల్లా స్థాయి అవార్డు



కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ భాస్కరరావు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో పరిధిలోని రామచంద్రపురం బస్ స్టేషన్‌కు స్వచ్ఛ బస్‌స్టేషన్స్ విభాగంలో జిల్లా స్థాయి అవార్డు వరించింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల చేతుల మీదుగా డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు ఈ అవార్డు, జ్ఞాపికలను అందుకున్నారు. డిపో మేనేజర్ భాస్కరరావు మాట్లాడుతూ సిబ్బంది, కార్మికుల సమష్టి కృషితోనే ఈ అవార్డు లభించిందని పేర్కొన్నారు. డిపో మేనేజర్ భాస్కరరావును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పలువురు ప్రముఖులు అభినందించారు.

మెకానిక్‌లు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ద్రాక్షారామలో మోటారు సైకిల్ మెకానిక్‌లకు సూచనలు ఇస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: మోటారు సైకిల్ మెకానిక్‌లు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. మండలంలోని ద్రాక్షారామలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోటారు సైకిల్ మెకానిక్‌లకు నెల రోజుల పాటు నిర్వహించనున్న బీఎస్ 6, బీఎస్ 7 సాంకేతికతల ఉచిత శిక్షణను మంత్రి సుభాష్ సోమవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా మెకానిక్‌లు పోటీ ప్రపంచంలో నిలబడగలని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ముద్ర రుణాలు వచ్చే విధంగా సహకరిస్తామన్నారు. ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు టూల్ కిట్లు ఉచితంగా అందజేస్తామన్నారు. బైక్ రిపేర్ సాంకేతిక నిపుణుడు శివగణేష్ 78 మంది మెకానిక్‌లకు మారిన సాంకేతికతకు అనుగుణంగా ఓబీడీ స్కానర్లు, సెన్సార్లు, ఆధునిక ఇంజిన్ టెక్నాలజీ, ఉద్గార నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, నాయకులు పెంకే సాంబశివరావు, కొత్తపల్లి శ్రీనుబాబు, కోట తాతబ్బాయి, మెకానిక్ యూనియన్ నాయకుడు పిల్లా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: కాజులూరు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. సోమవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ వీర్రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుయ్యేరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మండల కేంద్రమైన కాజులూరుకు కొత్త విద్యుత్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. లైన్ల ఏర్పాటులో భాగంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ కాజులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అయితపూడి, తిప్పరాజుపాలెం, కాజులూరు, కాజులూరు శివారు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. గృహ అవసరాల వినియోగదారులతో పాటు ఇండస్ట్రియల్, ఆక్వా చెరువులకు సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలంటూ ఆందోళన



చేదువాడ సచివాలయం వద్ద కుయ్యేరు, గొల్లపాలెం రోడ్డుపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, స్థానికులు

కాజులూరు: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుయ్యేరు, గొల్లపాలెం రహదారి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో మండల గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు పాల్గొని చేదువాడ గ్రామ సచివాయం వద్ద కుయ్యేరు, గొల్లపాలెం రహదారిపై ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ఈ రహదారిలో గొల్లపాలెం, కుయ్యేరు మధ్య రూ.36 కోట్లతో 13 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారన్నారు. అయితే ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మధ్యలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయన్నారు. వర్షాల సమయంలో గోతుల్లో నీరు నిలిచిపోయి సైకిళ్లు, మోటారుసైకిల్ వంటి వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాల పాలవుతున్నారన్నారు. ఆటో, ట్యాక్సీ వంటి వాహనాలు సైతం గోతులు దాటి వెళ్లేందుకు వీలు లేకుండా ఉందని అధికారులు స్పందించి తక్షణ చర్యల్లో భాగంగా కనీసం గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేదువాడ సర్పంచ్ గంజా దేవి, వైఎస్సార్ సీపీ నాయకుడు గంజా సూరిబాబు, మాజీ సర్పంచ్ పెంకే సూర్యనారాయణ, సీపీఎం నాయకులు కురుపూడి భూచక్రం, దంగేటి శ్రీనివాసు, పిల్లి నాగేశ్వరరావు గంజా సుబ్బలక్ష్మి, సత్యవతి, కామేశ్వరి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హైఓల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ కృష్ణ శర్మ కాలనీలో హై ఓల్టేజీ కారణంగా సోమవారం ఉదయం పలు ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 30 గృహాల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, ఏసీలు, ఇన్వర్టర్లు, స్విచ్ బోర్డులు కాలిపోయాయన్నారు. గాఢ నిద్రలో ఉండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. దీంతో నిద్రలో ఉన్న వారు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. పిల్లలను తీసుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీశారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చేనేత కార్మికులకు ప్రజా సంఘాల మద్దతు



అంగరలో చేనేత కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

కపిలేశ్వరపురం: తమ సంఘానికి ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ అంగరలోని శ్రీగణపతి చేనేత పారిశ్రామిక సంఘం ఎదుట చేనేత కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారంతో 9వ రోజుకు చేరుకుంది. నియోజకవర్గ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల ఐక్య వేదిక అధ్యక్షుడు ధూళి జయరాజు, ప్రధాన కార్యదర్శి వీరమల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మల్లువలస గణపతి, ప్రచార కార్యదర్శి తీగిరెడ్డి మహేష్, కన్నంరెడ్డి వెంకట్రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు బంగ దావీదు నేత కార్మికులకు మద్దతు పలికారు. దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ, చేనేత వృత్తిని కేవలం చేతి వృత్తిగానే కాకుండా దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వృత్తిగా చూడాలన్నారు. బకాయిలను వెంటనే చెల్లించడం ద్వారా చేనేత సంఘాలను బతికించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఆ దిశగా స్పందించాలని డిమాండ్ చేశారు.

బాల్ బ్యాడ్మింటన్ రిఫరీకి అభినందన



మండపేట కళాశాలలో వెంకట్రావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కపిలేశ్వరపురం (మండపేట): బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తమిళనాడులో ఇటీవల నిర్వహించిన 71వ జాతీయ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రిఫరీగా వ్యవహరించిన వారా వెంకట్రావును మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ అధ్యాపక సిబ్బంది అభినందించారు. వెంకట్రావు మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్ పని చేస్తున్నారు. ఉద్యోగ నిర్వహణతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చడం క్రీడాకారులకు ఆదర్శమన్నారు. అభినందించిన వారిలో ఎన్ఎస్‌వీ కిరణ్ కుమార్, గోపాలకృష్ణ, మధు కుమార్ అభినయ్, సీనియర్ అసిస్టెంట్ రామలక్ష్మీదేవి, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

సీసీఆర్‌టీ శిక్షణకు 'నాగళ్ల' ఎంపిక



నాగళ్ల శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం (మండపేట): భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీసీఆర్‌టీ శిక్షణకు మండపేట మండలం ద్వారపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాగళ్ల శ్రీనివాసరావు ఎంపికయ్యారు. నూతన విద్యా విధానం 2020కి అనుగుణంగా విద్యను సంస్కృతికి అనుసంధానించాలనే ప్రధాన లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సీసీఆర్టీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. జిల్లాకు ఒక్కొక్కరు చొప్పున ఉపాధ్యాయులకు అవకాశం దక్కిందని శ్రీనివాసరావు తెలిపారు. సహజ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో పాఠశాల పాత్ర అనే అంశంపై నేటి నుంచి 16 వరకు రాజస్థాన్ ఉదయపూర్‌లోని ప్రాంతీయ సాంస్కృతిక వనరుల శిక్షణ కేంద్రంలో నిర్వహించే శిక్షణకు హాజరుకానున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు.

అవార్డు అందుకున్న చైర్‌పర్సన్, కమిషనర్



అమలాపురంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దుర్గారాణి, రంగారావు

కపిలేశ్వరపురం (మండపేట): 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' పథకంలో భాగంగా జిల్లాలో 'స్వచ్ఛత సేవా' కార్యక్రమం విజయవంతం చేసినందుకు మండపేట మున్సిపాలిటీ అవార్డుకు ఎంపికైంది. ఆ నేపథ్యంలో సోమవారం అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కమిషనర్ టీవీ రంగారావు అవార్డును అందుకున్నారు. వారితోపాటు ఉత్తమ సేవలందించినందుకు పారిశుధ్య కార్మికులు బొట్టా నూరి బాబు, వడ్డాది దుర్గారావు ప్రశంసలందుకున్నారు. మున్సిపాలిటీకి అవార్డు దక్కడం తనకు సంతోషాన్నిచ్చిందని చైర్‌పర్సన్ దుర్గారాణి అన్నారు.

బిల్లుల కోసం కలెక్టరేట్ వద్ద నిరసన

అమలాపురం రూరల్: ఉపాధి హామీ పథకంలో పల్లె పండగ పథకంలో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి పది నెలలైనా ప్రభుత్వం బిల్లు చెల్లించలేదని కాంట్రాక్టర్లు సోమవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ మేరకు బిల్లులు తక్షణమే చెల్లించాలని వారు కోరారు. రాయపరెడ్డి శ్రీనివాసరావు, సామా బుచ్చిరామయ్య, పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ, బిల్లులు రాకపోవడంతో అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. బిల్లుల కోసం పీఆర్ కమిషనర్ కృష్ణతేజను కలిసి విన్నవించి ఐదు నెలలైనా ఇప్పటికీ స్పందన లేదని వాపోయారు. బిల్లులు రాకుంటే ఆత్మహత్యలు చేసుకోవలసి వస్తుందని వారు హెచ్చరించారు.